అంగన్‌వాడీల్లో ఆకలి కేకలు

- కందిపప్పు కొరతతో ఉడకని పప్పు
- అప్పు తెచ్చుకుంటున్న కార్యకర్తలు
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


భోజనం చేస్తున్న చిన్నారులు



రాయదుర్గం: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. కందిపప్పు సరఫరాలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఫలితంగా లబ్ధిదారులకు పప్పుచారు కరువైంది. రెండు నెలలుగా ఇదే పరిస్థితి. కేంద్రాల ద్వారా ఇచ్చే ఆహారంలో నాణ్యత ప్రమాణాల ప్రకారం లబ్ధిదారులకు అందించాలి. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. సమాధానం చెప్పుకోలేక అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల విధిలేక కొనుగోలు చేసి, పిల్లలకు పప్పన్నం పెట్టి ఆర్థిక భారం మోస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజక వర్గాల్లోని ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలోని 1025 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాడ్డాయి. వీటిలో గర్భిణులు 7,227, బాలింతలు 7,873, 07–3 సంవత్సరాల పిల్లలు 32,587, 3–6 ఏళ్ల పిల్లలు 22,481 మంది ఉన్నారు. వీరందరికీ నాణ్యత ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారం అందించాల్సి ఉంది. 07–3 ఏళ్ల పిల్లలకు ప్రతి నెలా 2.5 లీటర్ల పాలు, 2.50 కిలోల బాలామృతం, 25 కోడిగుడ్లు, గర్భిణులు, బాలింతలకు 25 కోడి గుడ్లు ఇస్తారు. 3–6 పిల్లలకు 100 గ్రాముల పాలు, కోడిగుడ్లు, నాణ్యమైన భోజనం అందిస్తారు. ఇందులో ఎక్కువ కేలరీలు ఉండే గుడ్డు, ఆ తర్వాత కంది పప్పు. అంతటి ప్రాధాన్యత కలిగిన కందిపప్పు సరఫరాలో జాప్యం కనిపిస్తోంది. గుడ్లు సైతం పరిమాణం కంటే చిన్న సైజులో ఉండేవి సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కందిపప్పు లేక చాలా కేంద్రాల్లో కూరగాయాలతో వంట చేస్తున్నారు. దీంతో పౌష్టికాహారం సక్రమంగా అందలేదు.

మార్కెట్లో మండుతున్న ధరలు

మార్కెట్లోనూ కందిబేడల ధరలు భగ్గు మంటున్నాయి. కిలో రూ.170 నుంచి రూ.180 ధర పలుకుతోంది. దీంతో సామాన్యులు సైతం కొనలేని, తినలేని పరిస్థితి. కనీసం అంగన్‌వాడీ కేంద్రాల్లోనైనా ఆ కోరిక తీరుతుందనుకుంటే ఇక్కడ ఆ పరిస్థితులు కనిపించలేదు. దీంతో పౌష్టికాహారం లభించక గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యాలు క్షీణిస్తూ రక్తహీనత భారిన పడుతున్నారు.

టెండర్లు పిలిచాం



అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కొరతలేకుండా సరఫరా చేస్తున్నాం. కొన్ని కేంద్రాలకు మాత్రమే గత నెల కంది పప్పు సరఫరా జరగలేదు. ఈ నేపథ్యంలో టెండర్ పిలిచాం. ఈ నెల నుంచే జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని కేంద్రాలకు కందిపప్పు అందిస్తాం. టెండర్ ప్రాసెస్ కాస్త ఆలస్యం కావడంతోనే కొన్ని చోట్ల ఇబ్బందులు తలెత్తాయి. ప్రస్తుతం ఆ కొరతన్న మాటే లేకుండా కందిపప్పు సరఫరా చేస్తాం. ఈ దిశగా కార్యచరణ పూర్తిచేశాం. – శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం

ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా వివరాలిలా..

ప్రాజెక్టు	అంగన్‌వాడీ	గర్భిణులు	బాలింతలు	07–3సం పిల్లలు	3–6 సం పిల్లలు
రాయదుర్గం	185	1,910	1,964	8,998	5,571
కణేకల్లు	138	1,126	1,014	1,200	3,000
కళ్యాణదుర్గం	79	1,100	1,930	4,455	2,968
కంబదూరు	198	1,188	1,122	5,907	4,824
ఉరవకొండ	325	1,903	1,861	12,027	6,118

గర్భిణుల ఆరోగ్యంపై అలసత్వం చూపొద్దు


కూడేరులో రక్త పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి నారాయణస్వామి


గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

కూడేరు: హై–రిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై అలసత్వం వహించొద్దని..మాతా శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఎన్‌సీడీ–ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ నారాయణ స్వామి మండల వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం(పీఎంఎంవీవై) కింద గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అధికారి నారాయణస్వామి తనిఖీ చేశారు. వైద్యులు లక్ష్మీనారాయణ, సౌమ్యారెడ్డితో సమావేశమై మండల వ్యాప్తంగా ఎంత మంది గర్భిణులున్నారు? వారిలో ఎంత మందిని హై–రిస్క్ గర్భిణులుగా గుర్తించారు? ఆరోగ్యంపై వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవీంద్ర, యశోద, ఫార్మసిస్టు వేణుగోపాల్, ఎల్‌టీ వేణుగోపాల్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

బ్రహ్మసముద్రం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ అల్తాఫ్ ఆధ్వర్యంలో గర్భిణులుకు బీపీ, హెచ్‌బీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ అల్తాఫ్ మాట్లాడుతూ గర్భిణులు సరైన ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు, మొలకెత్తిన గింజలు, ఐరల్, క్యాల్షియం కలిగి ఉండే ఆహారం ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ వనజాఅక్కమ్మ

కుందుర్పి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని కంబదూరు ఐసీడీఎస్ సీడీపీఓ వనజా అక్కమ్మ, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా సీడీపీఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, సర్పంచ్ మారుతేశ్వరి పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవడంలో విఫలం



కళ్యాణదుర్గం: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. సోమవారం ఆయన విజయవాడలో వరదలు, ప్రభుత్వం సహాయక చర్యలు చేపట్టక అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై స్పందించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరద ముప్పు ఉందని కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా, రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేకపోయిందన్నారు. ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే పలు కాలనీలు వరదలకు అతలాకుతలమయ్యాయన్నారు. వరదలు వచ్చిన మూడు రోజుల తర్వాత అధికారులు సహాయక చర్యలకు పూనుకోవడం దారుణమన్నారు. దీనికి తోడు వరద బాధితులను ఆదుకోవడంలోనూ అధికార యంత్రాంగం, ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఇందుకు కారణం శుక్రవారం వరదలు వస్తే శని, ఆదివారాల్లో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ప్రాణ,ఆస్తి నష్టాలు భారీగా జరిగినట్లు తెలిపారు. వరదల్లో చిక్కుకున్న వారికి కనీసం తాగునీరు కూడా సక్రమంగా అందించలేకపోవడం సిగ్గుచేటన్నారు. పదుల సంఖ్యలో మృత్యువాత పడ్డారని, అనేక మంది రోగులు మందులు అందక తీవ్ర ఇబ్బందులు పడినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. వరద బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమైన ప్రభుత్వం తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి సాయంపై ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎదురుదాడికి దిగుతూ ప్రెస్‌మీట్లు పెట్టడం సరికాదన్నారు. పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి వరద బాధితులను ఆదుకోవాలని కోరితే ప్రశ్నించిన వారిపై నిందించడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా..? లేదా అనేది యావత్ రాష్ట్ర ప్రజలు అడుగుతున్నారని, త్వరలోనే కూటమి ప్రభుత్వానికి ప్రజలే స్వయంగా బుద్ధి చెప్పే రోజులు తప్పక వస్తాయన్నారు.


తలారి రంగయ్య, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

వైభవంగా గణేష్ నిమజ్జనం


కళ్యాణదుర్గం : టీసర్కిల్‌లో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, బొమ్మనహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, గోనేహాళ్, ఉంతకల్లు, ఉంతకల్లు క్రాస్, దేవగిరి, నేమకల్లు, బండూరు, సింగానహళ్లి, ఉప్పరహాళ్, ఎల్‌బీనగర్, కృష్ణాపురం తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఊరేగించారు. యువకులు డప్పులు వాయిస్తూ రంగులు చల్లుతూ హంగామా చేశారు. జై..గణేశా..జైజై గణేశా అంటూ కేరింతలు కొట్టారు. విగ్రహాలను హెచ్చెల్సీ కాలువలో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ నబీరసూల్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వినాయకుడికి ఘన వీడ్కోలు

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా బ్రహ్మసముద్రం, పిల్లలపల్లి, ముప్పలకుంట, వేపులపర్తి, చెలిమేపల్లి, తదితర గ్రామాల్లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం భక్తులను అన్నదానం చేశారు. అనంతరం వినాయక విగ్రహాలను వాహనాల్లో కొలువు దీర్చి, గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు.

గుమ్మఘట్టలో నిమజ్జనం

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో చవితి రోజు కొలువుదీరిన వినాయకుడిని ఆయా గ్రామస్తులు నిమజ్జనానికి తరలించారు. మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. వినాయకుడిని ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపడ్లుంచి గ్రామాల వీధుల్లో ఊరేగించారు.

నిమజ్జనానికి తరలివెళ్లిన గణనాథులు

కంబదూరు: మండలంలో వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను సోమవారం నిమజ్జనానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం భక్తులు గణనాథులను ట్రాక్టర్లలో ఎక్కించి, బాణా సంచాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి, నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ ఆంజనేయులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కుందుర్పిలో...

కుందుర్పి: మండలంలోని 36 గ్రామాల్లో సోమవారం వినాయక చవితి వేడుకల్లో భాగంగా నిమజ్జనం చేశారు. కుందుర్పి, మలయనూరు, బెస్తరపల్లి, ఎనుములదొడ్డి, ఎర్రగుంట, కదరంపల్లి తదితర గ్రామాల్లో వినాయక ప్రతిమలను ఊరేగించారు. ఎస్‌ఐ వెంకటస్వామి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళ్యాణదుర్గంలో..

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలో వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. సాయంత్రం 4 గంటల నుంచి నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు.


కూడేరు: వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పట్టణ సమీపంలోని ముదిగల్లు రోడ్డులోని నీటి కుంటలో నిమజ్జనం చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు.

బెళుగుప్ప మండలంలో...

బెళుగుప్ప: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనం చేశారు. బ్రాహ్మణపల్లి తండా, బెళుగుప్ప తండా, దుద్దేకుంట, కోనంపల్లి, బెళుగుప్ప, జీడిపల్లి, ఎర్రగుడి, గుండ్లపల్లి, నరసాపురం, యలగలవంక, కాలువపల్లి, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ శివ, ఏఎస్‌ఐ రామదాసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వజ్రకరూరులో కోలాహలంగా నిమజ్జనం

వజ్రకరూరు: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం వినాయక నిమజ్జనం చేశారు.గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక ట్రాక్టర్లలో వినాయక ప్రతిమలను తీసుకెళ్లి, గ్రామాలకు సమీపంలోని కుంటలు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూడేరులో వినాయకుడి నిమజ్జనం

కూడేరు: మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథున్ని ఏర్పాటు చేసిన మంటపాల వద్ద అన్నదానం చేశారు. వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఉంచి, ఊరేగించారు. అనంతరం గ్రామ చివర్లలో నీటి వసతి ఉన్నచోట, చెరువుల్లో గణనాథుడిని నిమజ్జనం చేశారు. సీఐ శివరాముడు బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఉద్దేహాళ్‌లో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

లంబోదర వినాయకుడికి పూజలు

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడులోని ఏకలవ్య నగర్‌కాలనీలో లంబోదర వినాయకుడికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

విఘ్నేశ్వరా..పాహిమాం

రాయదుర్గంటౌన్: పట్టణంలో కొలువుదీరిన గణనాథులు మూడో రోజు సోమవారం భక్తులకు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. వినాయక సర్కిల్, తేరు బజారు, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, మార్కండేయస్వామి ఆలయం, శాంతినగర్, నేసేపేట, నేతాజీ రోడ్డు, ఓబుళాచారి రోడ్డు, మొలకాల్మూరు రోడ్డు ప్రాంతాల్లో వెలసిన గణనాథుల అలంకరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల మైదానంలో హిందూమహాగణపతి దర్శనానికి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా గణనాథుల నిమజ్జనం : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల నిమజ్జనం వైభవంగా జరిగింది. పట్టణంలో మొత్తం 50కిపైగా బొజ్జగణపయ్యలు కొలువుదీరగా, మూడో రోజు సోమవారం దాదాపు 20కిపైగా మంటపాల్లో వెలసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు.


కంబదూరులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు


బెళుగుప్పలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు


ముప్పలకుంటలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం


గుమ్మఘట్టలో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


నాన్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులోని నాన్ చెరువులో చిన్న వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నాన్ చెరువులో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లను ఇన్‌చార్జ్ ఏఈ కోదండ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్‌తో కలిసి పరిశీలించారు. 5 అడుగుల లోపు విగ్రహాలను మాత్రమే నాన్ చెరువులో నిమజ్జనం చేసేందుకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు చూసుకోవాలని సూచించారు.

సరిత మృతికి కారకులను శిక్షించాలి

రాయదుర్గంటౌన్: గుమ్మఘట్ట మండలం శిరిగేదొడ్డికి చెందిన ఆర్ట్స్ కళాశాల డిగ్రీ విద్యార్థిని బోయ సరిత హంతకులను కఠినంగా శిక్షించాలని ఏపీ మహిళా సమాఖ్య రాయదుర్గం కార్యదర్శి పార్వతి డిమాండ్ చేశారు. గ్రామం నుంచి అనంతపురంలోని కళాశాలకు వెళ్లిన సరిత ఆత్మకూరు మండలం వడ్డిపల్లి సమీపంలో దారుణ హత్యకు గురైందన్నారు. సరిత మృతికి కారకులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని, చట్టాలను కఠినతరం చేయాలన్నారు.

ఆరు వాహనాల సీజ్


రికార్డులు లేని వాహనదారులతో మాట్లాడుతున్న ఎంవీఐ కేవీఎల్ఎన్ ప్రసాద్

కూడేరు: మండల పరిధిలోని అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎల్ఎన్ ప్రసాద్ సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రానికి సంబంధించి ఆరు కార్లకు పర్మిట్ లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. మరో నాలుగు ఆంధ్రా వాహనాల డ్రైవర్లకు లైసెన్సులు, ఇతర రికార్డులు సరిగా లేకపోవడంతో వాటికి అపరాధ రుసుం విధించారు. వాహనదారులు తప్పకుండా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. లేదంటే అపరాధ రుసుం తప్పదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కేవీఎల్ఎన్ ప్రసాద్ హెచ్చరించారు.

విరాళాల సేకరణ

కూడేరు: విజయవాడ వరద బాధితులకు ఆర్థిక సాయం అందించేందుకు సీపీఐ నేతలు విరాళాలు సేకరించారు. రూ.10,528 వసూలు కాగా, ఆ మొత్తాన్ని వరద బాధితులకు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్‌కు నాయకులు సోమవారం అందించారు. పార్టీ తాలూకా కార్యాదర్శి మల్లికార్జున, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రమణ, తాలూకా నాయకులు వర ప్రసాద్, వ్యకాసం తాలూకా నాయకులు మలరాయుడు, మండల నేత శ్రీరాములు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి సహకరించండి


డాక్టర్లతో మాట్లాడుతున్న మండల ప్రజాప్రతినిధులు

కుందుర్పి: స్థానిక ప్రభుత్వాస్పత్రి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని వైద్యాధికారిణి అనూషా, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ కోరారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆస్పత్రి అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలమ్మ, జెడ్పీటీసీ రాధాస్వామి, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

కళ్యాణదుర్గం రూరల్: దొడగట్టలోని అంగన్‌వాడీ సెంటర్ వద్ద త్రుటిలో చిన్నారికి ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం దొడగట్టలోని అంగన్‌వాడీ సెంటర్ సమీపంలో ఉన్న నీటి సంపులోకి రాజ్‌కుమార్ అనే నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి పడిపోయాడు. గమనించిన సచివాలయ ఉద్యోగి రాజు వెంటనే బాలుడిని బయటకు తీశాడు. ఎవరూ చూడకపోతే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చర్చించుకున్నారు.

రూరల్ సీఐగా వంశీకృష్ణ



కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రూరల్ సీఐగా వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ బదిలీపై వెళ్లారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న వంశీకృష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదన్నారు.

రూ.35,116 పలికిన లడ్డూ ప్రసాదం


ఉప్పరవీధిలో వినాయక లడ్డూ ప్రసాదాన్ని వేలంలో దక్కించుకున్న ధనుంజయ

ఉరవకొండ: పట్టణంలోని ఉప్పరవీధిలో వినాయక మంటపం వద్ద నిర్వహించిన వేలంలో రూ.35,116కు ఉప్పర ధనుంజయ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. సోమవారం వినాయక చవితిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా వినాయకుడి లడ్డూ ప్రసాదం వేలం వేశారు. వేలంలో సగర సంఘం అధ్యక్షుడు ఉప్పర ధనుంజయ లడ్డూను దక్కించుకున్నాడు. స్వామివారి కండువాను ఉప్పర రుషేంద్రముని రూ.17,500కు దక్కించుకున్నట్లు విగ్రహదాత భాస్కర్ తెలిపాడు.

శ్రీవిఘ్నేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం వేలం


బెళుగుప్పలో వేలంలో దక్కించుకున్న వినాయకుడి లడ్డూ ప్రసాదం

బెళుగుప్ప: మండలంలోని శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద చవితికి ప్రత్యేక పూజలు నిర్వహించిన వినాయక లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఈశ్వరప్ప రూ.1,116 వేలం పాట ప్రారంభించారు. కిరాణా వ్యాపారి మఠం శివకుమార్ అనే బెళుగుప్పకు చెందిన భక్తుడు రూ.60,500కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నాడు. బ్రాహ్మణపల్లి తండాలో చవితి వేడుకల సందర్భంగా లడ్డూ ప్రసాద వేలం పాటలో రూ.1,16000కు వన్నూరుస్వామినాయక్ దక్కించుకున్నాడు.

వాహనాల వేలం

కళ్యాణదుర్గం రూరల్: అక్రమ మద్యం, సరఫరా కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను కళ్యాణదుర్గం సెబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ వెంకట్ సోమవారం తెలిపారు. వేలంలో పాల్గొననున్నవారు ఆధార్ కార్డుతోపాటు వారు రూ.1000 డిపాజిట్ చేయాలన్నారు.

ఘనంగా మారెమ్మదేవి రథోత్సవం


అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని కణేకల్లు క్రాస్‌లో సోమవారం మారెమ్మదేవి రథోత్సవం జరిగింది. మారెమ్మ జాతరను పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అమ్మవారికి కుంకుమార్చన, మంగళారతి, మహా మంగళారతి, ఆకు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సహ మూర్తిని రథంలో ఉంచి మెయిన్‌రోడ్డులో ఊరేగించారు. ఆలయం నుంచి కణేకల్లుక్రాస్ చౌరస్తా వరకు ఊరేగించారు. మారెమ్మ జాతర మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ


రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ దుర్గమ్మ ఆలయం సమీపంలో సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామూర్తి, మండల మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజగోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

విడపనకల్లు: మండలంలోని హంచనహాల్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వీరభద్రగౌడు (55) సోమవారం మృతి చెందాడు. రెండు రోజుల క్రితం వీరభద్రగౌడ్ ద్విచక్ర వాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కర్నూలు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స చేయిస్తుండగా, సోమవారం మృతిచెందాడు. వీరభద్రగౌడు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, ఎస్సీసెల్ జిల్లా నాయకులు సుంకన్న, గ్రామ సర్పంచు కేశన్న, వైస్ ఎంపీపీ భీంరావు సంతాపం తెలియజేశారు.

ఉత్సాహంగా ఉట్టి ఉత్సవం


బలిజవీధిలో ఉట్టిని కొడుతున్న యువకులు

వజ్రకరూరు: స్థానిక బలిజవీధిలో వినాయక చవితిని పురస్కరించుకొని ఉట్టికొట్టే కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. కాలనీకి చెందిన యువకులు ఉట్టి కొట్టడానికి ఉత్సాహం చూపారు.